# యువతకు అంతర్జాతీయ ఉద్యోగాలు

- రెండు జపనీస్ సంస్థలతో టామ్ కామ్ ఒప్పందాలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను విస్తరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కార్మిక ఉపాధి శిక్షణ శాఖ అధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) జపాన్‌లోని రెండు ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. టెర్న్ (టీజీయూకే టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్ తో రాష్ట్ర ప్రభుత్వం ఎంవోయూలు చేసుకుంది. జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అధికారుల బృందం ఆ రెండు సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపింది. తెలంగాణలో నైపుణ్యమున్న నిపుణులను జపాన్‌లోని అధిక డిమాండ్ ఉన్న రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. టెర్న్ గ్రూప్ టోక్యోలో ప్రాంతీయ కార్యాలయంతో పాటు సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్, స్కిల్డ్ వర్కర్ రంగాలలో అంతర్జాతీయ నియామకాలు చేపడుతుంది. రాజ్ గ్రూప్ జపాన్‌లో పేరొందిన నర్సింగ్ కేర్ సంస్థ త్సుకుయి కార్పొరేషన్ లిమిటెడ్ భాగస్వామ్యంతో గతంలో టామ్ కామ్ తో కలిసి పని చేసింది. కొత్త ఒప్పందంతో హెల్త్ కేర్ రంగంలో పాటు ఇతర రంగాల్లోనే సహకారం విస్తరించనుంది. ఈ రెండు జపనీస్ సంస్థలు రాబోయే ఒకటి నుండి రెండు సంవత్సరాలలో సుమారు 500 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. హెల్త్ కేర్, నర్సింగ్ రంగంలో 200 ఉద్యోగాలు, ఇంజనీరింగ్ రంగంలో (ఆటోమోటివ్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్/ఐటి) 100 ఉద్యోగాలు, హాస్పిటాలిటీ రంగంలో 100 ఉద్యోగాలు, మరియు నిర్మాణ రంగంలో (సివిల్ ఇంజనీరింగ్, భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సామగ్రి నిర్వహణ) వంద ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయి. యువతకు నైపుణ్యాల శిక్షణతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలకు ఈ ఒప్పందాలు అద్దం పట్టాయి.


జపనీస్ సంస్థల ప్రతినిధులతో సిఎం రేవంత్

**తెలంగాణలో డ్రై పోర్ట్**

**జపాన్ తెలుగు సమాఖ్య ప్రతినిధులతో సిఎం రేవంత్**

తెలంగాణలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఐటీ, ఫార్మా రంగంలో సాధించాల్సినంత ప్రగతి సాధించామని ఆయన తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న సిఎం...శనివారం టోక్యోలో తెలుగు సమాఖ్య కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రపంచంతో పోటీ పడేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం..అందుకు మీ తోడ్పాటు అవసరమని సిఎం కోరారు. "టోక్యోలో అభివృద్ధి చేసిన రివర్‌ఫ్రంట్‌ను పరిశీలించాం. మూసీ నది ప్రక్షాళనకు కొంత మంది అడ్డుపడుతున్నారు. ఢిల్లీ పరిస్థితిని చూసి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం లేదా? మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్ తెలంగాణ పురోగతికి కీలకం" అని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు రావాలి.. పరిశ్రమలు పెరగాలి. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టంచేశారు. రాష్ట్ర అభివృద్ధిలో అందరి సహకారం అవసరం. మీ తోడ్పాటుతో ప్రపంచంతోనే మనం పోటీ పడొచ్చు అని అన్నారు. "మీ ఆలోచనలను రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకోండి. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకోవడంలో ఉన్న ఆనందం మీకు తెలుసు" అని సీఎం రేవంత్‌రెడ్డి అని రేవంత్ పేర్కొన్నారు.

## 22న ఇంటర్ ఫలితాలు - 12 గంటలకు విడుదల చేయనున్న ఉప ముఖ్యమంత్రి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫలితాలు ఈనెల 22వ తేదీన విడుదల కానున్నాయి. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని నాంపల్లి ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఫలితాలను విడుదల చేస్తారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఇంటర్ ఫలితాలను తమ అధికారిక వెబ్‌సైట్ స్త్రఎఅవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. సమాచారం కోసం విద్యార్థులు ఐవీఆర్ పోర్టల్ 9240205555 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. లేదంటే ఈమెయిల్ ష్ట్ర వ శ్రీ జూ ఎ వ ం ఎ - ఱవవీవశ్రీఖఱస్త్రుఖఱ.స్త్రశీజ.ఱఅ కు మెయిల్ పంపాలని తెలిపారు. గత నెల ఐదు నుంచి 25వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. గతనెల పదో తేదీ నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ రాష్ట్రంలో 19 కేంద్రాల్లో ప్రారంభమైంది. మూల్యాంకనం ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 4,88,448 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,08,523 మంది కలిపి మొత్తం 9,96,971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

## హెచ్‌ఎండిఎ గ్రౌండ్‌లో ఫైర్ స్టాళ్ల ఏర్పాటు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ, సివిల్ డిఫెన్స్ విభాగాల స్టాళ్లను హైదరాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ పక్కనున్న హెచ్‌ఎండిఎ గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు ఆ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, అగ్నిమాపక వాహనాల ర్యాలీని ప్రారంభించి ఫ్లాగ్ ఆఫ్ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఎఫ్‌డి డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని వారు పేర్కొన్నారు.

## బిజెపికి కెటిఆర్ కట్టుబానిస

- లిక్కర్ కుంభకోణం నుంచి కవితను బయటపడేసే యత్నం
- టిపిసిసి చీఫ్

**ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో**

బిజెపికి మాజీ మంత్రి కెటిఆర్ కట్టుబానిసలా పని చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను లిక్కర్ కుంభకోణం నుంచి బయటపడేసే క్రమంలో బిజెపితో ఆ పార్టీ లోపాయికారీ ఒప్పందం చేసుకుందని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపిని గెలిపించేందుకు కెటిఆర్ తాపత్రయ పడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి, కాంగ్రెస్ ఒక్కటేనంటూ మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుపట్టారు. సంఖ్యా బలం లేని బిజెపి.. బిఆర్ఎస్ అండ చూసుకొని ఎన్నికల్లో పోటీ చేస్తోందని తెలిపారు. అవినీతి కేసుల నుంచి తప్పించుకునేందుకు కమలం పార్టీతో లోపాయికారీ ఒప్పందం చేసుకుందని విమర్శించారు. పదేండ్లలో రాష్ట్రాన్ని దోచుకున్న బిఆర్ఎస్ నేతలపై కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ ప్రశ్నించకపోవడంతో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ నిర్ణయాలన్నింటికీ మద్దతిచ్చిన ఆ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్‌ను ప్రశ్నించడం హాస్యాస్పదన్నారు. ఎమ్మెల్సీ కవితను లిక్కర్ కుంభకోణం నుంచి కాపాడేందుకు బిజెపికి ఊడిగం చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. పదిహేను నెలల స్వల్ప కాలంలో రికార్డు స్థాయిలో పెద్ద ఎత్తున ఉద్యోగాలివ్వడం, రైతు, మహిళా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం, బిసిలకు 42 రిజర్వేషన్లు ఇవ్వడం, ఎస్‌సి వర్గీకరణ చేయడం, పేదలకు సన్నబియ్యం అందించడం వంటి గొప్ప పనులను సర్కార్ చేపట్టినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం బిఆర్ఎస్ నేతల అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు.

## అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో 24.25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, దక్షిణాది రాష్ట్రాల జెఎసి అధ్యక్షులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద శనివారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఇందిరాగాంధీ ఇచ్చిన ఈ అసైన్డ్ భూములు అన్యాక్రాంతమై ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు మరింత భూమిలేని వారయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి వారికి యాజమాన్య హక్కులు కల్పించి వారి బతుకులు బాగు చేయాలని కోరారు. గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. 1977 పీఓటీ చట్టాన్ని వెంటనే రద్దు చేసి అక్కడ మొలిచిన చెట్లను తొలగించాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని మురికివాడల్లో పేదలు నిర్మించుకున్న ఇండ్లకు భద్రత కల్పించాలని కోరారు. ఇండ్లను క్రమబద్ధీకరించి.. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ కానీ అసైన్డ్ భూములను వెంటనే ఆన్‌లైన్ చేయాలని. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి అసైన్డ్‌దారులకే కేటాయించాలని కోరారు. న్యాత్రి ల్యాండ్ లైన్‌ను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బింగి రాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు శివయ్య, జస్టిస్ ఈశ్వరయ్య, బిజెపి నాయకులు సాంబశివరావు, జెబి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అమెరికా ఉపాధ్యక్షులు 'జెడి వాన్స్ గో బ్యాక్'

- 21న నిరసనలు
- ఎస్‌కెఎం పిలుపు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

స్వేచ్ఛా వాణిజ్యం పేరుతో భారతదేశం వ్యవసాయం, పాడి పరిశ్రమ, చేపలు పట్టడం వంటి అంశాలపై అమెరికాతో అసమాన ఒప్పందాలు చేసుకోబోతున్నదని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) విమర్శించింది. ఈ నెల 21న అమెరికా ఉపాధ్యక్షులు జెడి వాన్స్ మన దేశానికి వస్తుండడంతో 'వాన్స్ గో బ్యాక్' భారతదేశం అమ్మకానికి లేదు అనే నినాదంతో నిరసనలు తెలపాలని పిలుపునిచ్చింది. ఈ మేరకు శనివారం ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు టి.సాగర్, పశ్యపద్మ, వి.ప్రభాకర్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, కొండల్, పెద్దారపు రమేష్, నాగిరెడ్డి, ఆర్.వెంకట్ రాములు, కాంతయ్య, రామకష్ట తదితరులు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో నిరసనలు, దిష్టి బొమ్మల దహనం కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయాలకు అతీతంగా భారతీయులందరూ ఐక్యంగా ఉండి 'సైమన్ గో బ్యాక్' నినాదమిచ్చినట్టుగానే, ఇప్పుడు 'వాన్స్ గో బ్యాక్. భారతదేశం అమ్మకానికి లేదు' అంటూ నినదించాలని కోరారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదం ముందు పూర్తిగా లొంగిపోయిందని విమర్శించారు.

# ఆధార్‌లాగే త్వరలో భూధార్

- భూ సమస్యలు పరిష్కరించేందుకే 'భూభారతి'
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

పేద ప్రజల కన్నీరు తుడిచేది.. రైతుల భూ సమస్యలు తీర్చేది 'భూభారతి' చట్టమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లా గగ్గలపల్లి గ్రామంలో శనివారం 'భూ భారతి చట్టం- 2025'పై అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ప్రసంగించారు. భూభారతి చట్టం వందేళ్లకు సరిపడే విధంగా ఉందన్నారు. ధరణి పోర్టల్‌తో ఎదుర్కొన్న భూ సమస్యలను భూభారతి చట్టం ద్వారా తీర్చనున్నట్టు తెలియజేశారు. 2020 ధరణి చట్టంలో సాదాబైనామా అనే అంశాన్ని గత ప్రభుత్వం తొలగించిందని తెలిపారు. గతంలో రైతులు సాదాబైనామా కోసం ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల్లో సక్రమంగా ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా రైతులకు సేవలు అందిస్తామన్నారు. రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే చెప్పులు అరిగేలా అధికారుల చుట్టూ తిరిగారని, ఇప్పుడు ఆ అవసరం లేదని, అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. మే 1 నుంచి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. రైతులకు భూభారతి చట్టం అమలు విషయంలో ఏమైనా సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. భూమి సాగు చేసుకుంటూ భూమిపై హక్కు లేని అర్హులైన ప్రతి పేదవారికీ హక్కులు కల్పిస్తామని తెలిపారు.


సదస్సులో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**చట్టాల అధ్యయనం : మంత్రి జూపల్లి**

సంవత్సరం పాటు ఇతర రాష్ట్రాల్లోని చట్టాల్ని అధ్యయనం చేసి భూభారతి చట్టానికి రూపకల్పన చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ధరణి చట్టం ద్వారా రైతులు తమకు వారసత్వంగా వచ్చిన భూమి హక్కుల కోసం అనేక సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ప్రతిపక్షాలు అవాస్తవాల్ని వాస్తవాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వాటిని గుర్తించి తిప్పికొట్టాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన రూ.8 లక్షల అప్పులపై ప్రస్తుతం తమ ప్రభుత్వం ప్రతి నెలా వడ్డీ రూపంలోనే రూ.6 వేల కోట్లు కట్టాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు.

**పొంగులేటికి తప్పిన ప్రమాదం**

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. భూభారతి చట్టంపై అవగాహన సదస్సు కోసం నాగర్‌కర్నూల్‌కు మంత్రి పొంగులేటి, ఎంపి మల్లు రవి, సీనియర్ నేత సంపత్‌కుమార్ హెలికాప్టర్‌లో వచ్చారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ల్యాండింగ్ చేస్తున్న క్రమంలో సిగ్నల్ కోసం బుల్లెట్ ఫైర్ చేయడంతో కింద ఉన్న గడ్డిపై పడి అగ్ని ప్రమాదం సంభవించింది. పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పేశారు. దీంతో ప్రమాదం తప్పింది.


లబ్దిదారుని ఇంట్లో భోజనం చేస్తున్న మంత్రి

## చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం

- సన్నబియ్యం లబ్దిదారు ఇంట్లో భోజనం చేసిన మంత్రి తుమ్మల

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నా ఈ సన్న బియ్యం పథకాన్ని రద్దు చేయలేరని, ఇది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే పథకం అని వ్యవసాయ, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధి బుడిదంపాడు గ్రామపంచాయతీలో సన్నబియ్యం లబ్దిదారుని ఇంట్లో మంత్రి శనివారం భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదవారికి పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో సన్నబియ్యం పథకాన్ని ప్రారంభించామని, రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మందికి ఆరు కిలోల సన్నబియ్యం అందజేస్తున్నామని అన్నారు. అందుకు ఎన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చయినా ప్రభుత్వం భరిస్తుందన్నారు. పేదవారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవాలన్న సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. పథకాన్ని పౌర సరఫరాల శాఖ ద్వారా పకడ్బందీగా అమలు చేసి పేదవారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దేశంలోనే అత్యధికంగా వడ్లను పండించిన రాష్ట్రంగా తెలంగాణ చరిత్రలో నిలిచిందని తెలియజేశారు. ఈసారి యాసంగిలో కూడా అత్యధికంగా దిగుబడి వచ్చే అవకాశం ఉందని, రైతుల శ్రమ ఎక్కడికీ పోదన్నారు. రైతు భరోసా 10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని, పండించిన ప్రతి చివరి గింజా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. సన్న వడ్లు పండిస్తే రూ.500 బోనస్ ఇస్తామని, రైతులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎటిఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

## మరో రెండు అప్‌గ్రేడ్ ఎటిఎం కేంద్రాల ఏర్పాటు

- మహేష్ బ్యాంక్ వెల్లడి

**ప్రజాశక్తి - హైదరాబాద్**

ఆంధ్రప్రదేశ్ మహేష్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ మరో రెండు అప్‌గ్రేడెడ్ ఎటిఎం కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. నగరంలోని సీతాఫల్‌మండి, చంపాపేట్ శాఖల్లో ఏర్పాటు చేసిన వీటిని లాంఛనంగా ప్రారంభించినట్లు పేర్కొంది. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ డైరెక్టర్ అరుణ్ కుమార్ భంగడియా, శివ్ కుమార్, సిఎ మురళి మనోహర్ పలోడ్ పాల్గొన్నారు. మహేష్ బ్యాంక్‌కు నాలుగు రాష్ట్రాల్లో 45 శాఖలున్నాయి.

## జెఇఇ మెయిన్‌లో రెసోనెన్స్ విద్యార్థుల విజయం

**ప్రజాశక్తి - హైదరాబాద్**

ఆల్ ఇండియా జెఇఇ మెయిన్ 2025లో హైదరాబాద్‌లోని 'రెసోనెన్స్' జూనియర్ కళాశాలల విద్యార్థులు చారిత్రాత్మక విజయం సాధించారని ఆ సంస్థ తెలిపింది. మంచి ప్రగతిని కనబర్చిన ఆ సంస్థ విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను రెసోనెన్స్ డైరెక్టర్ పూర్ణచంద్రరావు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక పరీక్షలో అద్భుత విజయం సాధించడం రెసోనెన్స్ ప్రతిభ మరోసారి నిరూపితమైందన్నారు. ఐఐటి, ఎన్ఐటి, నీట్, ఇతర మెడికల్ ప్రవేశ పరీక్షల్లో అగ్రశ్రేణి ర్యాంకులు సాధించడంలో ముందంజలో ఉన్నామన్నారు. రెసోనెన్స్ విద్యార్థి అర్చిస్మాన్ 295/300 స్కోర్ చేయడంతో ఓపెన్ కేటగిరీలో ఆల్ ఇండియా ర్యాంక్ 13 వచ్చిందన్నారు. హైదరాబాద్ రెసోనెన్స్ జూనియర్ కళాశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 100 పర్సెంటైల్ సాధించారన్నారు. 57 మంది విద్యార్థులు 99 పర్సెంటైల్ పైగా మార్కులు సాధించారన్నారు. మొత్తం 285 మంది విద్యార్థులు విభిన్న సబ్జెక్టుల్లో 99 పర్సెంటైల్ పైగా వచ్చాయన్నారు.

## జెఇఇలో ఆకాష్ విద్యార్థులకు టాప్ స్కోర్లు

**ప్రజాశక్తి - హైదరాబాద్**

జెఇఇ మెయిన్స్ 2025లో తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా తమ విద్యార్థి హర్ష్ ఎ గుప్తా నిలిచారని ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ తెలిపింది. తమ విద్యార్థులు అసాధారణ ప్రతిభను చూపారని వెల్లడించింది. 100 పర్సంటైల్ సాధించి హైదరాబాద్‌కు చెందిన హర్ష్ ఎ గుప్తా తెలంగాణ రాష్ట్ర టాపర్‌గా నిలువగా.. అతనితో పాటుగా కొత్త ధనుష్ రెడ్డి 99.99 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ర్యాంక్ 179, సంహిత పోలాడి 99.98 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ర్యాంక్ 203, రాఘవన్ ఏపూరి 99.97 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ర్యాంక్ 417, భరత్ నాయుడు కిలారి 99.95 పర్సంటైల్‌తో ఆల్ ఇండియా ర్యాంక్ 821 సాధించి తల్లిదండ్రులతోపాటుగా ఇనిస్టిట్యూట్‌కు గర్వకారణంగా నిలిచారని ఆ సంస్థ చీఫ్ అకడమిక్ అండ్ బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు.

# ఓరుగల్లుకు దండులా కదలండి

- తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టండి
- వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికను బహిష్కరిస్తున్నాం
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ జెండా ఎగురవేసి 27 నాటి ఆవిర్భావ సభ కోసం ఓరుగల్లుకు దండులా కదలాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన బిఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని గ్రేటర్ వాసులు మరోసారి నిరుపించాలని కోరారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామనీ, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. సిఎం రేవంత్‌రెడ్డి పనికి మాలిన పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజలే బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ సాధించిన విజయాలు అసమాన్యమైనవని కొనియాడారు. 2017 జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో 150కి 99 కార్పొరేట్ స్థానాలు గెలిచి చరిత్ర సృష్టించిందని చెప్పారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో క్లీన్ స్వీప్ చేశామని గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఓఆర్ఆర్ లోపల గులాబీ జెండానే ఎగిరిందని తెలిపారు. హైదరాబాద్ వాసుల ముందు కాంగ్రెస్, బిజెపి మాయమాటలు పనిచేయబోవని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో సిఎం రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు మొట్టికాయలు వేసినా హైడ్రా తన పనితీరు మార్చుకోలేదని విమర్శించారు. సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పతనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంలో దాదాపు లక్ష మందికి పైగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల అమలుకు డబ్బులు లేవని అంటున్న సిఎం లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ ఎలా చేస్తారని నిలదీశారు. రేవంత్‌రెడ్డి బిజెపితో కలిసి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నాడని విమర్శించారు. "లగచర్లలో లంబాడ రైతులను జైల్లో పెడితే బిజెపి నేతలు మాట్లాడలేదు. రేవంత్ రెడ్డి హామీలను అమలు చేయకపోతే కూడా వారు అడగడం లేదు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీల మీద ఇడి చార్జిషీట్ నమోదు చేస్తే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్క మాట కూడా బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదు." అని కెటిఆర్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నిమ్స్ ఆస్పత్రిలో అగ్నిప్రమాదం

- ఐదో అంతస్థులోని ఎమర్జెన్సీ వార్డులో మంటలు

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ ఆస్పత్రిలో అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం ఐదో అంతస్తులోని ఎమర్జెన్సీ వార్డులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సిబ్బంది, రోగులు భయాందోళనకు గురయ్యారు. వేగంగా మంటలు వ్యాపించడంతో వార్డుల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పరిసర ప్రాంతాల్లో దట్టంగా పొగ అలుముకుంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. ఈ ఘటనపై నిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం స్పందించింది. నిమ్స్ ఎమర్జెన్సీ బిల్డింగ్ ఐదో అంతస్తులో ఆడిటోరియం వద్ద (నాన్ పేషెంట్ ఏరియా) షార్ట్ సర్క్యూట్ జరిగిందని తెలిపింది. పొగలు వచ్చిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది, మంటలు అంటుకోకుండా చర్యలు తీసుకున్నారని పేర్కొంది. అక్కడెవరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదని, ఆస్తి నష్టం కూడా జరగలేదని తెలిపింది. ఈ అంశంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆస్పత్రి డైరెక్టర్ బీరప్పతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

**టపాసుల కలకలం**

ఇదిలా ఉండగా, ఆస్పత్రిలో ప్రమాదం జరిగిన అంతస్తులోని ఓ గదిలో టపాసులు ఉండటం కలకలం రేగింది. మంటలను ఆర్పే క్రమంలో అగ్నిమాపక సిబ్బంది వాటిని గుర్తించింది. టపాసులకు నిప్పు అంటుకొని ఉంటే దానికి బాధ్యులు ఎవరని రోగుల సహాయకులు ప్రశ్నిస్తున్నారు. అసలు ఆస్పత్రి గదిలోకి టపాకాయలు ఎవరు తీసుకొచ్చారు, ఎందుకు తీసుకొచ్చారు అనే విషయంపై చర్చ నడుస్తోంది. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు.

## ఓటింగ్‌లో పాల్గొనకుంటే ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించినట్టే

- రాజాసింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంని గెలిపించేందుకు కాంగ్రెస్, బిఆర్ఎస్, మజ్లిస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ విమర్శించారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేయొద్దని బిఆర్ఎస్ కార్పొరేటర్లకు ఆ పార్టీ నేత కేటీఆర్ ఆదేశించడం ప్రజాస్వామ్యాన్ని ధిక్కరించడమే అవుతుందని పేర్కొన్నారు. భాగ్యనగర్‌లో బిఆర్ఎస్ ను పాతరేస్తామని హెచ్చరించారు. మజ్లిస్ ను గెలిపిస్తే కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్పొరేటర్ల రాజకీయ భవిష్యత్తు ఖతమైనట్లేనని పేర్కొన్నారు.

## ప్రపంచ ఓవర్సీస్ కాంగ్రెస్ మహాసభలు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ ఓవర్సీస్ కాంగ్రెస్ మహాసభలు సభలు ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని హైటెక్స్ లో జరగనున్నాయి. సభలకు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఎంపి ప్రియాంకగాంధీ హాజరు కానున్నారు. రెండు రోజులపాటు జరగనున్న ఈ సమావేశాలకు 33 దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రపంచ వ్యాప్తంగా కాంగ్రెస్ భావజాలాన్ని విస్తరించేందుకు మహాసభలను నిర్వహిస్తున్నట్టు గాంధీభవన్ వార్గలు తెలిపాయి.

# సమగ్ర భూ సర్వే చేపట్టాలి

- ప్రభుత్వ సర్వేయర్లను నియమించాలి
- ధరణి, భూ భారతి మధ్య పెద్ద తేడాలేం లేవు
- ఎస్‌వికె వెబినార్‌లో రైతుసంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో సమగ్ర భూ సర్వే నిర్వహిస్తేనే రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి సాగర్ అన్నారు. దీనికోసం రెవెన్యూ విభాగం అధికారికంగా ప్రభుత్వ సర్వేయర్లను నియమించాలని సూచించారు. కేవలం విఆర్ఒలను తిరిగి నియమిస్తే, సమస్యల్నీ పరిష్కారమవుతాయనే భ్రమలు సరికాదన్నారు. ధరణి స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం రైతాంగానికి పాక్షిక న్యాయాన్ని అందిస్తుందే తప్ప, శాశ్వత పరిష్కారాలు చూపలేదని అభిప్రాయపడ్డారు. భూ భారతిని నాలుగు జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారనీ, ఆ అనుభవాలతో చట్టంలో మరిన్ని సవరణలు చేస్తారని ఆశిస్తున్నామన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'భూ భారతి చట్టం భూ సమస్యల్ని పరిష్కరిస్తుందా?' అంశంపై జరిగిన వెబినార్‌లో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. గతంలో కౌలు రైతులకు కొన్ని హక్కులు కల్పిస్తూ చట్టాలు ఉన్నాయనీ, మాజీ సిఎం కెసిఆర్ హయాంలో ధరణి తెచ్చాక వాటన్నింటినీ ఒక్క కలం పోటుతో రద్దు చేసి, కాస్తు కాలమ్ ఎత్తేశారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికీ 30 శాతం వ్యవసాయం కౌలు రైతుల ద్వారానే జరుగుతుందన్నారు. భూ భారతిలో కాస్తు కాలమ్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తామని చెప్తున్నారనీ, కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితుల్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రైతు ఆత్మహత్యల్లో సగానికి పైగా కౌలు రైతులవే ఉన్నాయనీ, వారికి ప్రత్యేకంగా ఎలాంటి హక్కులు లేకపోవడంతో ఆర్థికంగా చితికిపోయి అన్ని రకాలుగా అవస్థలు పడుతున్నారని వివరించారు. కౌలు రైతుల్ని గుర్తించేది లేదని అప్పటి సిఎం కెసిఆర్ అసెంబ్లీలో స్వయంగా చెప్పారని గుర్తుచేశారు. 2011లో ఉమ్మడి రాష్ట్రంలో వచ్చిన చట్టం ప్రకారం కౌలుదారులకు అప్పట్లో రుణ అర్హత కార్డులు ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం దాన్ని కూడా ఎత్తేసిందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా వంటివి వారికి వర్తించట్లేదన్నారు. పంట అమ్ముకొనే అవకాశం కూడా కౌలుదారుకి లేదనీ, కొనుగోలు కేంద్రాల్లో సర్వే నెంబర్ రాయాల్సి ఉంటుందనీ, దానితో మళ్లీ ఆ సొమ్ము భూ యజమాని ఖాతాలోకే వెళ్తుందని వివరించారు. రాష్ట్రంలో 1940లో చివరి సారిగా భూ సర్వే జరిగిందనీ, ఆ తర్వాత. సమగ్ర భూసర్వేను ఏ ప్రభుత్వం చేయలేదని చెప్పారు. ఆరువేల మంది సర్వేయర్లకు లైసెన్సులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందనీ, దీనివల్ల అవినీతి పెరుగుతుందే తప్ప, రైతులకు ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. ఇవన్నీ తాత్కాలిక ఉపశమనాలే తప్ప, శాశ్వత చర్యలు కాదన్నారు. పొరుగురాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో అక్కడి ప్రభుత్వమే దాదాపు 10వేల మంది సర్వేయర్లను రిక్రూట్ చేసిందని గుర్తుచేశారు. తెలంగాణలో క్షేత్రస్థాయిలో సాంకేతిక సిబ్బంది లేరనీ, భౌతికంగా సమగ్ర భూ సర్వే చేయాలంటే వారి అవసరం చాలా ఉంటుందని వివరించారు. భూ సమస్యలను తహసీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల పరిధిలో పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వం చెప్తున్నదనీ, అప్పటికీ సాధ్యం కాకుంటే న్యాయస్థానాల్ని ఆశ్రయించాల్సి ఉంటుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ధరణికి, భూ భారతికి మధ్య సమూల మార్పులైతే ఏమీ లేవని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భూ సర్వే అంశాలు, పోడు వ్యవసాయం హక్కు పత్రాల డిమాండ్లు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. అయితే భూ భారతిని పైలెట్ ప్రాజెక్ట్‌గా చేస్తున్నారు కాబట్టి, అది పూర్తయితే మరింత సమగ్రమైన చట్టానికి రూపకల్పన జరుగుతుందని భావిస్తున్నామన్నారు. కార్యక్రమానికి సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్ వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు.



జెసిబితో ప్రహరీ గోడను తొలగిస్తున్న సిబ్బంది

## తుర్కయంజాల్‌లో హైడ్రా కూల్చి వేతలు

- కాలనీలకు అడ్డంగా కట్టిన ప్రహరీ తొలగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడా పరిధిలో సర్వే నెంబర్లు 213, 214లో నిర్మించిన ఫ్రీ కాస్ట్ వాల్స్‌ను హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 213, 214 సర్వే నెంబర్లలో గతంలో రంగనాథ్ అనే వ్యక్తి లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించాడు. అలాగే, ఈ స్థలం తనదంటూ.. కోర్టు నుంచి తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ రెండు సంవత్సరాల కిందట రోడ్డుకు అడ్డుగా ఫ్రీకాస్ట్ వాల్స్ నిర్మించాడు. దాంతో పలు కాలనీలకు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కాలనీల వాసులు రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో ఇటీవల హైడ్రాను ఆశ్రయించారు. దాంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు విచారణ జరిపి రోడ్డుకు అడ్డుగా వేసిన ఫ్రీ కాస్ట్ వాల్స్‌ను కూల్చేశారు. దాంతో కాలనీలవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## అంగన్‌వాడీలకు మే నెలంతా సెలవులివ్వాలి

- కర్ణాటకలో మాదిరిగా జిఒ విడుదల చేయాలి
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, హెల్పర్లలందరికీ మే నెలంతా ఒకేసారి సెలవులివ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి, కోశాధికారి పి.మంగ డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కర్నాటక రాష్ట్రంలో అంగన్‌వాడీలకు మే నెలంతా ఒకేసారి సెలవులిస్తూ ఇటీవల జారీ చేసిన జిఒను దానికి జతపరిచారు. మినీ అంగన్‌వాడీలకు 11 నెలల వేతనం చెల్లించాలని కోరారు. ప్రీ ప్రైమరీ స్కూల్స్ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలనీ, ఐసిడిఎస్‌ను యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో ఇవ్వాలని విన్నవించారు. ఆ సమస్యల పైన అధికారులు స్పందిస్తూ ఇతర రాష్ట్రాల్లో మే నెలంతా సెలవులు ఇచ్చిన ఆధారాలతో ఇచ్చిన కర్ణాటక ఆర్డర్ కాపీతో రాష్ట్ర ప్రభుత్వానికి ఫైల్ పెడతామని హామీనిచ్చారు. మినీ అంగన్వాడీ టీచర్స్ పెండింగ్ వేతనాలు ఏరియర్స్ జీవో వచ్చిందని తెలిపారు. ఫైనాన్సులో అప్రూవల్ రావడానికి 15 రోజులు సమయం పడుతుందన్నారు. రిటైర్మెంట్ కొత్త జిఒ పైన ప్రభుత్వం ఇంకేమీ రిప్లై ఇవ్వలేదని గుర్తుచేశారు. ప్రీ ప్రైమరీ స్కూల్స్ రద్దు చేయాలని ఇచ్చిన వినతి పత్రాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్)కు రూ. 516.40 కోట్లు

- మంజూరీ ఫైలుపై సంతకం చేసిన మంత్రి సీతక్క
- అందులో కేంద్రం వాటా 60 శాతం, రాష్ట్ర వాటా 40 శాతం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న సీతక్క

స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ్)కు రూ.516.40 కోట్లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) మంజూరు చేశారు. దానికి సంబంధించిన ఫైలుపై ఆమె సంతకం చేశారు. ఆ నిధుల్లో కేంద్రం వాటా 60 శాతంకాగా రాష్ట్ర ప్రభుత్వ వాటా 40 శాతం. స్వచ్ఛ భారత్ నిధులతో ఈ ఏడాది గ్రామీణ ప్రాంతాల్లో 1,90,166 వ్యక్తిగత టాయిలెట్ల నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దానికి సంబంధించి ఒక్కో టాయిలెట్‌కు రూ.12 వేల చొప్పున మొత్తం రూ.228.19 కోట్లు కేటాయించారు. బస్టాండ్లు, పర్యాటక ప్రాంతాలు, మార్కెట్లు, స్కూళ్లు, ఆస్పత్రులు, తదితర ప్రాంతాల్లో 410 కామన్ సానిటేషన్ కాంప్లెక్స్ లు (సాముహిక టాయిలెట్లు) నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో కాంప్లెక్స్ కు రూ.3 లక్షల చొప్పున మొత్తం రూ.12.30 కోట్లు కేటాయింపు చేశారు. అందులో ఎస్‌బీఎమ్(జి) నిధులు 70 శాతం కాగా 15వ ఆర్థిక సంఘం నుంచి 30 శాతం నిధులు వెచ్చించనున్నారు. మొట్టమొదటి సారిగా పల్లెల్లో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ యూనిట్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.64 లక్షల చొప్పున 100 యూనిట్ల నిర్మాణం కోసం రూ.64 కోట్లు కేటాయించబడ్డాయి. అయితే, వాటిని కట్టేందుకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసే బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. 100 శాతం నిధులు ఎస్‌బిఎం (జి) నుంచే కేటాయించారు. ఇంకుడు గుంతలు, మిగిలిన జిపిల్లో వాటర్ మేనేజ్ మెంట్ షెడ్ల నిర్మాణం కోసం కూడా వెచ్చించనున్నారు. ఇవి 100 శాతం ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుంచి ఖర్చుపెట్టనున్నారు.

# విడిసిలను రద్దు చేయాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నిజామాబాద్ జిల్లాలో విలేజ్ డెవలప్‌మెంట్ (విడిసి) కమిటీలను వెంటనే రద్దు చేయాలని ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాళ్లరాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తేయాలని, గౌడ సామాజిక తరగతి మహిళలను గుడి నుంచి గెంటేసి ఈత చెట్లను తగలబెట్టిన వీడీసీ సభ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తాలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ గుమ్మడి రాజు నరేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జె.కుమారస్వామి మాట్లాడారు. తాళ్లరాంపూర్ గీత కార్మికులపై సాంఘిక బహిష్కరణ ఎత్తేయాలని డిమాండ్ చేశారు. విడిసిలను రద్దు చేసి.. కమిటీ సభ్యుల దౌర్జన్యాలను అరికట్టేలా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలన్నారు. ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.నాగలక్ష్మి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎ.పద్మ, వై.వరలక్ష్మి మాట్లాడుతూ.. గుడిలోకి రానీయకుండా మహిళలను గెంటేసిన విడిసి కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.దశరథ్ మాట్లాడుతూ.. ఆ గ్రామంలో అంత జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు ఆర్.అశోక్, ముషీరాబాద్ జోన్ కార్యదర్శి టి.మహేందర్, సనత్‌నగర్ జోన్ కన్వీనర్ పి.మల్లేష్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎండి జావిద్, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండీ పాషా, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎన్.మారన్న, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చారకొండ వెంకటస్వామి, మరియాల గోపాల్, టిపిఎస్‌కె జిల్లా నాయకులు రాజయ్య గౌడ్, కెవిపిఎస్ నగర నాయకులు జి కిరణ్, రజక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి, నాయకులు లక్ష్మయ్య, తుల్జా భాయ్, షబానా బేగం, లావణ్య పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం

- ఆ రెండు పార్టీలదీ అదే తీరు
- ఎంపి రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బిఆర్ఎస్ సర్కారులో మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనూ రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం జరుగుతున్నదనీ, ఈ విషయంలో ఆ రెండు పార్టీలదీ ఒకటే తీరని బిజెపి ఎంపి రఘునందన్‌రావు విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1965లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ భూములే కాకుండా వృక్ష సంపద సమృద్ధిగా ఉన్న ప్రాంతాలను కూడా అడవులుగా గుర్తించాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. పర్యావరణ విధ్వంసంపై కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, భూపేందర్ యాదవ్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. ఆ భూముల విషయంలో బిజెపి ఎంపి పాత్ర ఉందంటూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. కంచె గచ్చిబౌలి భూముల విషయంలో అన్ని డాక్యుమెంటరీ ఆధారాలతో కేంద్ర పర్యావరణ శాఖ ముందు తమ పార్టీ ఎంపిలందరూ వాదనలు వినిపించారని గుర్తుచేశారు. సాధికారత కమిటీకి అవసరమైన డాక్యుమెంటరీ ఆధారాలను సమర్పించారని తెలిపారు. హెచ్‌సీయూ భూముల అంశంపై బిజెపిపైనా, ప్రధాని మోడీపైనా అనవసర విమర్శలు చేయడాన్ని ఆయన మానుకోవాలనీ, లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

## బిల్డింగ్ పైనుంచి దూకి బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గేట్ ఇంజనీరింగ్ కళాశాల బిల్డింగ్ పైనుంచి దూకి బీటెక్ థర్డ్ ఇయర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం రామాపురం గ్రామంలో శనివారం జరిగింది. విద్యార్థిని తండ్రి లింగయ్య, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన లింగయ్య రెండో కుమార్తె కృష్ణవేణి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో గేట్ కాలేజీలో బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నారు. కాలేజీ సెలవులకు స్వగ్రామానికి వెళ్లి తిరిగి ఈనెల 18న తల్లి లక్ష్మితో కృష్ణవేణి కాలేజీకి వచ్చారు. చీకటి పడిపోవడంతో తల్లి లక్ష్మి అక్కడే పడుకున్నారు. శనివారం ఉదయం బాత్రూంకి వెళ్తున్నానని తల్లికి చెప్పి నేరుగా కళాశాల 5వ అంతస్తుకు వెళ్లి అక్కడ నుంచి కృష్ణవేణి కిందకు దూకేశారు. తల పగిలి ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. కుమార్తెను చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. కళాశాల యాజమాన్యం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో చిలుకూరు మండల ఎస్ఐ సురభి రాంబాబు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చదువులో వెనుకబడి పోతుండటంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చన్న అనుమానం వ్యక్తమవుతోంది.

# వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా ఉద్యమం

- సిపిఐ రౌండ్‌టేబుల్‌లో వక్తల పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో




రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వక్త

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా రైతాంగ పోరాటం తరహాలో ఉద్యమించాలని పలువురు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు,మేధావులు పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన ఈ కొత్త చట్టానికి వ్యతిరేకంగా మతాలు, కులాలకు అతీతంగా అందరూ ఏకమై తిప్పికొట్టాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో 'వక్ఫ్ సవరణ చట్టం ఎవరి కోసం?' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్రం తెచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా తమ పార్టీ ప్రధాన కార్యదర్శి డి రాజా సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేశారని గుర్తు చేశారు. ఒక వైపు న్యాయపోరాటం, మరో వైపు ప్రజా ఉద్యమాలతో కేంద్రం వైఖరిని ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కేరళలో జరగనున్న సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశంలో వక్ఫ్‌బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఓ విధానపరమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత మోటూరి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని వెచ్చించి మరీ వక్ఫ్ బోర్డు చట్ట సవరణను చేసిందన్నారు. అవకాశవాదులైన ఎపి సిఎం చంద్రబాబు, బీహార్ సిఎం నితీష్ కుమార్ వారి డిమాండ్లను నేరవేర్చుకున్న తర్వాతే ఈ బిల్లుకు మద్దతిచ్చారని విమర్శించారు. ఈ చట్ట సవరణ అదానీ, అంబానీల కోసమేనని అన్నారు. దేశాన్ని గుజరాతీ వ్యాపారుల నుంచి విముక్తి చేసేందుకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్ బోస్, ఈటి నరసింహ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం సవరణతో ముస్లిములకు మాత్రమే అన్యాయం జరుగుతుందన్న అభిప్రాయం సరైంది కాదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రజలను వీడదీసేందుకు ఎన్ని కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. బిజెపి ప్రభుత్వాన్ని ఆర్ఎస్ఎస్ నడుపుతుంటే, ఆర్ఎస్ఎస్‌ను అదానీ, అంబానీలు నడుపుతున్నారని అన్నారు. వందల ఏళ్లుగా ఉన్న మసీదులు, ఈద్గాలు, ఆలయాలకు సంబంధించి ఎలాంటి కాగితాల్లేవనీ, కేంద్ర ప్రభుత్వానికి ధైర్యముంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంబీటీ అధికార ప్రతినిధి అహ్మదుల్లా ఖాన్ మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ సీఎంగా 1994లో అధికారం చేపట్టిన చంద్రబాబు వక్ఫ్ భూముల అన్యాక్రాంతానికి నాంది పలికారని అన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదలు, తెలంగాణ ఏర్పడిన తర్వాత సిఎం కెసిఆర్ వరకు అందరూ వక్ఫ్ బోర్డు భూములను కొల్లగొట్టారని విమర్శించారు. ప్రధాని మోడీ ఏకంగా వక్ఫ్ బోర్డు భూములను లూటీ చేసేందుకు సవరణ చట్టాన్నే తీసుకొచ్చారని చెప్పారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో తాము భాగస్వాములమవుతామన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సహాయ కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఇన్సాఫ్ రాష్ట్ర అధ్యక్షులు మునీర్ పటేల్, జర్నలిస్ట్, రచయిత స్కైబాబా, భారత జాతీయవాదుల ఉద్యమం జాతీయ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ అలీ జుబేర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ నవీద్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వరంగల్ జిల్లా అధ్యక్షుడు మౌలానా ఫసియుద్దీన్ ఖాస్మి, ముస్లిం ఐక్యత, అభివృద్ధి ఉద్యమం వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ సుభాన్, ఆల్ ఇండియా సూఫీ ఉలేమా కౌన్సిల్, అధ్యక్షుడు మౌలానా ఖైరుద్దీన్ సూ, జామియత్ ఎ అహ్లే హదీస్ తెలంగాణ ప్రతినిధి ఆసిఫ్ ఉమ్రీ, జమాత్ ఎ ఉలేమా ఎ హింద్ ప్రతినిధి మెహబూబ్ మదానీ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు ఎన్ శ్రీకాంత్, షంషుద్దీన్, ఎండి సలీం, సలీమ్ ఖాన్, కాంపల్లి శ్రీనివాస్, గ్యార నరేష్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.




హక్కుల పరిరక్షణ యాత్ర నిర్వహిస్తున్న మహిళలు

## మహిళలకు భద్రత కల్పించాలి

- పని ప్రదేశాల్లో, కాలేజీల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలి
- ఐద్వా రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలపై, బాలికలపై జరుగుతున్న హింసను, లైంగిక వేధింపులను అరికట్టి భద్రత కల్పించాలని, కాలేజీ, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. 'పూలే అంబేద్కర్ యాదిలో' మహిళా హక్కుల పరిరక్షణ యాత్ర శనివారం సిద్దిపేట, జనగామ జిల్లాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న హక్కులు కేంద్రంలోని బిజెపి పాలనలో హరించబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 33 శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి.. దాన్ని డీలిమిటేషన్ తర్వాత అమలు చేస్తామని మహిళలను మోసం చేసిందన్నారు. భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని ప్రయత్నిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "భేటీ భచావో" "భేటీ పడావో" అంటూనే మహిళలపై జరుగుతున్న దాడులు, హింస, హత్యలు, లైంగికదాడులు, కుల దురహంకార హత్యల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ గడ్డపై చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి మహిళలు పునికిపుచ్చుకొని హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిచిందని.. ఎన్నికల మ్యానిఫెస్టో చెప్పిన హామీలను అమలు చేయాలని కోరారు. ఈ యాత్రలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, బుగ్గవీటి సరళ, రాష్ట్ర కమిటీ సభ్యులు సాయి లీల, ఆయా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిబిఎం పద్ధతిలో తవ్వితే కార్మికుల సంగతేంటి?

- ఆరుగురి ఆచూకి ఏదీ?
- వంద మీటర్ల మేర శిథిలాలు
- టిబిఎం కిందే కార్మికులు ఉండే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో అత్యంత ప్రమాదకరమైన జోన్‌గా ప్రకటించిన ప్రాంతంలో వంద మీటర్ల మేర మట్టిని, శిథిలాలను యంత్రాలతోనే తొలగించాలి. టిబిఎం మిషన్‌తో తవ్వితేనే పనులు త్వరితగతిన పూర్తవుతాయని నిపుణులు చెబుతున్నారు. టిబిఎం మిషన్‌తో తవ్వితే టన్నెల్ చివరలో ఇరుక్కున్న కార్మికుల సంగతేంటి. మనుషులు వెళ్లలేని ప్రదేశంలో యంత్రాలు ఉపయోగిస్తే.. మృతదేహాలు మట్టిలో కలిసే అవకాశాలున్నాయి. ఎస్ఎల్‌బిసి సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికులను వెలికితీసే ప్రక్రియ నేటితో పూర్తి కానున్నందున అందరి చూపు దోమలపెంట వైపు మళ్లింది. ఇక టిబిఎం మిషన్‌ను ఉపయోగిస్తారని తెలుస్తోంది. టన్నెల్ ప్రమాదం జరిగి నేటికి 58 రోజులు గడిచింది. ఇప్పటి వరకు ఇద్దరి కార్మికుల మృతదేహాలను వెలికి తీశారు. మిగిలిన ఆరుగురి ఆచూకీ కోసం డి-1, డి-2 వద్ద తవ్వకాలు చేస్తున్నారు. డి-2 వరకు కన్వేయర్ బెల్టును పునరుద్ధరించారు. టిబిఎం విడి భాగాల కత్తిరింపు ప్రక్రియ కొనసాగుతోంది. ఐదు ఎక్స్‌వేటర్లతో తవ్వుతూ బెల్టు ద్వారా మట్టి, టిబిఎం విడి భాగాలను బయటకు పంపుతున్నారు. లోకో ట్రైన్, కన్వేయర్ బెల్టు ద్వారా మట్టిని బయటకు తొలగించడంతో పాటు నీటి ఊటను మోటార్ల ద్వారా కృష్ణానదిలోకి పంపింగ్ చేస్తున్నారు. వంద మీటర్ల మేర శిథిలాలను తొలగించాల్సింది. అక్కడి నుంచి మరో వంద మీటర్ల మట్టిని తొలగిస్తే కార్మికుల ఆచూకీ తెలుస్తుందని అంచనా. టీబీఎం మిషన్ శిథిలాల తొలగింపు తర్వాత ఉండే ప్రదేశం అత్యంత ప్రమాదకరమని అధికారులు ప్రకటించారు.

### రెస్క్యూ టీం బృందాలు వెనక్కి

సొరంగంలో మనుషుల కంటే యంత్రాలతోనే ఎక్కువ పనులు నిర్వహిస్తున్నారు. అవసరమైన సాంకేతిక సిబ్బందిని తప్ప మిగతా వారిని బయటకు పంపి వారి వారి విధుల్లో చేరాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ప్రతిరోజూ మూడు షిఫ్టులలో 800 మంది కార్మికులు పనిచేశారు. ప్రస్తుతం 200మంది మాత్రమే పనిచేస్తున్నారు. మిగతా వారు తమ తమ విధుల్లో చేరుతున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్, సిఎస్ఐఆర్, ఎన్‌సిఎస్, ఆర్మీ, పిసిసిఎఫ్, డిజాస్టర్ మేనేజ్‌మెంటు, ఎస్‌డిఆర్ఎఫ్, సిడిఒ, కలెక్టర్, ఎస్‌పి, ఎస్ఎల్‌బిసి చీఫ్ ఇంజినీర్ వంటి కీలక శాఖల అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

### చివరలో టిబిఎంను వినియోగిస్తే ..

చివరి 100 మీటర్ల ప్రాంతంలో టిబిఎంను వినియోగిస్తే.. కార్మికుల పరిస్థితి ఏమిటని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బిడ్డల కడచూపు భాగ్యం కల్పించాలని వేడుకుంటున్నారు. టిబిఎం, బ్లాస్టింగ్ ద్వారా డ్రిల్లింగ్ మొదలు పెడితే కార్మికుల మృతదేహాలు మిషన్ దెబ్బకు ముక్కలు ముక్కలుగా మారుతాయని ఆందోళన చెందుతున్నారు. డి-1 దగ్గర 40 మీటర్లు, డి2 దగ్గర 28 మీటర్ల మేర మట్టి ఉంది. ఈ ప్రాంతంలో కార్మికుల ఆచూకీ ఉన్నట్టు తెలుస్తోంది. సొరంగంలో సహాయక బృందాల పర్యవేక్షణ ప్రత్యేకాధికారి శివశంకర్ లోథోటి ప్రతి రోజూ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

### మృతదేహాలను కుటుంబాలకు అప్పగించాలి

**వర్ధం పర్వతాలు, సిపిఎం జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్**

సొరంగంలో చిక్కుకున్న కార్మికుల మృతదేహాలను వెలికి తీసి కుటుంబాలకు అప్పగించాలి. కార్మిక కుటుంబాలకు తగిన పరిహారం అందజేయాలి. రెస్క్యూ టీం 58 రోజులుగా చేస్తున్న కృషి అభినందనీయం.

### ఇక ముందు ప్రమాదాలు జరగకుండా చూస్తాం

**శివశంకర్ లోథోటి, ప్రత్యేక అధికారి**

సొరంగంలో ఇరుక్కున్న కార్మికులను వెలికితీసే ప్రయత్నాల్లో ఉన్నాం. అందుకే అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నాం. మరో రెండ్రోజుల్లో విపత్తును ఛేదిస్తాం. ప్రభుత్వం కార్మికు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటుంది. ఇక ముందు సొరంగంలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మిగతా పనులను పూర్తి చేయడానికి టిబిఎం మిషన్‌ను